
ఈనాడు తిరుపతి

గురువారం అక్టోబరు 10, 2024

షార్‌లో మూడో ప్రయోగ వేదికకు సన్నాహాలు



శ్రీహరికోటలోని ప్రయోగ వేదికలు

శ్రీహరికోట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో కొత్తతరం వాహకనౌక (ఎన్‌జీఎల్‌వీ)తోపాటు ప్రత్యామ్నాయంగా వసతి కల్పించడానికి మూడో ప్రయోగ వేదిక ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రివర్గంతోపాటు స్పేస్ కమిషన్ ఈ ప్రయోగ వేదికకు ఆమోదం తెలిపాయి. ఇస్రో అంతరిక్ష రంగంలో దూసుకెళ్తూ భవిష్యత్తు ప్రయోగాలను దృష్టిలో పెట్టుకొని నేపథ్యంలో మూడో ప్రయోగ వేదిక అవశ్యమైంది. షార్‌లో రెండు ప్రయోగ వేదికలు ఉండగా మొదటిదానిని పీఎస్‌ఎల్‌వీ, రెండోది జీఎస్‌ఎల్‌వీ ప్రయోగాలకు వినియోగిస్తూ వచ్చారు. ఎల్‌వీఎం-3, గగన్‌యాన్ ప్రయోగాలకుగాను రెండో ప్రయోగ వేదికను పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. మూడో ప్రయోగ వేదికను సౌండ్ రాకెట్ కాంప్లెక్సు సమీపాన ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మూడో ప్రయోగ వేదిక అధ్యయన కమిటీ స్థలాన్ని గుర్తించింది. రెండో వాహక అనుసంధాన భవనం నుంచి ఇక్కడకు ట్రాక్ సైతం ఏర్పాటు చేయనున్నారు. మూడో వేదికలో రాకెట్లను నిలిపేందుకు వీలుగా టవర్, ప్రొపెలెంట్ తదితర వసతులు చేపట్టనున్నారు.

12 వరకు డిగ్రీ స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశాల గడువు కొనసాగుతోంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు మూడు విడతలు అవకాశం ఇచ్చారు. అయినప్పటికీ ప్రవేశాలు 60 శాతానికి మించకపోవడంతో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను ఈనెల 7 నుంచి 9 వరకు చేపట్టారు. ఐతే ఈనెల 12వ తేదీ వరకు రూ. 450 అపరాధ రుసుంతో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అవకాశం కల్పించారు. విద్యార్థులు డిగ్రీలోని కొన్ని విభాగాల్లో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. బీకాం కంప్యూటర్స్‌లో మాత్రమే 95 శాతం భర్తీ అయినట్లు సమాచారం. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ విభాగాల్లో 40 శాతం వరకు సీట్లు మిగిలిపోగా ఆర్ట్స్‌లో సగం వరకే భర్తీ అయినట్లు తెలుస్తోంది. రానున్న మూడు రోజుల్లో అన్ని కళాశాలల్లో ప్రవేశాలను కనీసం 70 శాతానికి పెంచుకునేందుకు అధ్యాపక వర్గం కసరత్తు చేస్తోంది. జిల్లాలో 65 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

జగద్రక్ష.. ఆశ్రితపక్ష.. గజేంద్రమోక్ష



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరోరోజు బుధవారం ఉదయం శ్రీమలయప్ప స్వామి శ్రీకోదండ రాముని అవతారంలో ధనస్సు, బాణం ధరించి తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రామాయణంలో మారుతి స్థానం అద్వితీయం. గురుశిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్వ వివేచన గావించిన మహనీయులు కనుక ఈ ఇరువురినీ దర్శించిన వారికి పుణ్యఫలం లభిస్తుంది.

స్వర్ణరథంపై ఊరేగిన శ్రీనివాసుడు

బంగారు తేరులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామిని చూసి భక్తజనం పరవశులయ్యారు. సాయంత్రం శ్రీనివాసుడు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన స్వర్ణరథంపై ఊరేగుతూ భక్తలకు అభయమిచ్చారు. రాత్రికి గజ వాహనంపై అభయప్రదానం చేశారు. నిద్రలేవగానే ఐశ్వర్యానికి ప్రతీకయిన ఏనుగును దర్శించడంతో భోగభాగ్యాలు లభిస్తాయి. తన సార్వభౌమత్వాన్ని తెలిపేందుకు శ్రీవారు గజ వాహనంపై ఊరేగారు. సేవలో తొలిసారిగా సెంటు జాజుల మాలను వినియోగించారు. పెద్ద జీయర్, చిన్నజీయర్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశాల్‌మిశ్రా, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.



నేటి వాహన సేవలు

ఏడో రోజు గురువారం ఉదయం 8-10 గంటల వరకు సూర్యప్రభ వాహనసేవ, రాత్రి 7-9 గంటల వరకు చంద్రప్రభ వాహనసేవ జరగనుంది.







వచ్చీరాగానే వసూళ్ల వేట

ఎస్‌ఐ రహీమ్‌రెడ్డిపై వేటు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: ఆయనో ఎస్సై.. తన స్టేషన్ పరిధిలో జరిగే అక్రమాలను అడ్డుకుని శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాల్సి ఉండగా.. బాధ్యతల్లో చేరిన రెండో రోజే తన నిజస్వరూపం చూపించారు. అక్రమార్కులతో అంటకాగడం మొదలుపెట్టి వసూళ్లకు తెరతీశారు. విషయం ఎస్పీ సుబ్బరాయుడు దృష్టికి రావడంతో విచారణ అనంతరం బుధవారం సస్పెండ్ చేశారు. గుంటూరు రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై రహీమ్‌రెడ్డిని ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో కొరత ఉండటంతో ఇక్కడికి అటాచ్ చేశారు. గతనెల 17న బాధ్యతలు చేపట్టిన ఆయన రెండోరోజే వసూళ్లు ప్రారంభించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న కొత్తవీరాపురం గ్రామానికి చెందిన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోకుండా రూ.పది వేలు తీసుకుని వదిలేశారు. మట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయకుండా వారి నుంచి మరో రూ.20 వేలు తీసుకున్నారు. ఏర్పేడు మీదుగా కోళ్లవ్యర్థాలు తరలిస్తున్న వ్యాపారి నుంచి రూ.10 వేలు తీసుకుని అవినీతికి పాల్పడ్డారు. ఎస్సై వరుస అక్రమాలపై సమాచారం అందుకున్న ఎస్పీ విచారణకు ఆదేశించారు. అవినీతికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. అతని ప్రవర్తనతో పోలీసుశాఖకు చెడ్డపేరు వస్తోందని భావించి వెంటనే సస్పెండ్ చేశారు. అవినీతి, అక్రమ వసూళ్లు, నెలవారీ మామూళ్లను సహించేది లేదని.. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసే ఏ స్థాయి అధికారిపై అయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సస్పెండ్ ఒక్కటే కాదని అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పల్లె పండుగను విజయవంతం చేయాలి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా పరిధిలో ఈ నెల 14 నుంచి 20 వరకు పండుగ వాతావరణంలో 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆయన వివిధ శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారోత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో అధికారులు శ్రీనివాస ప్రసాద్, సుశీలా దేవి పాల్గొన్నారు.



తొట్టంబేడు మండలం పూడి, పెన్నలపాడు సమీపంలో స్వర్ణముఖి నదిలో బారులు తీరిన ట్రాక్టర్లు, టిప్పర్లు



రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, జేసీబీ దీపాలతో ఇసుకను తోడేస్తున్న వైనం

ఇదెక్కడి దోపిడీ..!

విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు

ఈనాడు, తిరుపతి: ఇసుక అక్రమాల దందాకు అడ్డూ ఆపూ లేకుండా పోతోంది. ఎక్కడ పడితే అక్కడ అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లకు ఇసుక నింపుతున్న జేసీబీలు కనుచూపు మేర కనిపిస్తున్నా యంత్రాంగానికి పట్టడం లేదు.

తొట్టంబేడు మండలం పూడి, పెన్నలపాడు సమీపంలో రాత్రి, పగలు తేడా లేకుండా హిటాచీలు, జేసీబీలతో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. రోజుకు నాలుగైదు జేసీబీలు, వందకు పైగా ట్రాక్టర్లు, యాభైకి తక్కువ లేకుండా టిప్పర్లతో స్వర్ణముఖి నదిని చీల్చి చెండాడేస్తున్నారు. ఇలా తోడేస్తే సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిస్థితి ఏమిటంటూ అక్కడి రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అక్రమమని తెలిసినా అడిగే వాళ్లు లేకపోవడం, అడ్డుకోవాల్సిన అధికార గణం ప్రేక్షకపాత్ర వహించడంతో స్వర్ణముఖిని జల్లెడ పట్టేస్తున్నారు. అధికారులు మాత్రం త్వరలో ఇక్కడే ఇసుక రీచ్ వస్తోందని చెబుతుండటం.. అక్కడి గ్రామస్థులకు కునుకులేకుండా చేస్తోంది. ఏమీ లేనప్పుడే ఇంతగా తవ్వేస్తే.. ఇక రీచ్ వస్తే తమ పరిస్థితి ఏమిటంటూ ఆందోళన చెందుతున్నారు.

మైనింగ్ అధికారుల పరిశీలన

తొట్టంబేడు మండలం స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో మైనింగ్ అధికారులు పూడి, పెన్నలపాడు సమీపంలోని అనధికార రీచ్‌లను బుధవారం పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఇసుకను విక్రయించి నగదు వసూళ్లు చేసుకునేందుకు అనువుగా ఏర్పాటు చేసుకున్న షెడ్డును తొలగించారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అక్రమ తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాడవీధులకు వందేళ్ల బృహత్తర ప్రణాళిక అవసరం



అధికారులతో సమీక్షిస్తున్న తితిదే ఈవో శ్యామలరావు, చిత్రంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మాడవీధుల్లో మరో వందేళ్లకు సరిపడా బృహత్తర ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. బుధవారం రాంభగీచా అతిథిగృహం వద్ద తితిదే అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో కీలకఘట్టమైన గరుడ వాహనసేవను తితిదే అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. తితిదేలోని అన్ని శాఖల పనితీరును అభినందించారు. ఆరోగ్యశాఖ మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన వాహన సేవలను విజయవంతం చేయాలన్నారు. రాబోయే రోజుల్లో గ్యాలరీల వద్ద మరిన్ని శాశ్వత మరుగుదొడ్లను నిర్మిస్తామన్నారు. జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్‌వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

227 మద్యం దుకాణాలకు 2,212 దరఖాస్తులు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మద్యం దుకాణాల దరఖాస్తు గడువు మరో రెండు రోజులు పెంచారు. రాజకీయ నాయకులు, బడా వ్యాపారుల ఒత్తిళ్ల కారణంగా పలుచోట్ల దరఖాస్తుల సంఖ్య తగ్గిందని భావించిన ప్రభుత్వం గడువు పెంచింది. ఈనెల 11వ తేదీ వరకు అవకాశం కల్పించింది. జిల్లాలో 227 మద్యం దుకాణాలకుగాను బుధవారం సాయంత్రం 8 గంటలకు 2,212 దరఖాస్తులు అందాయి. తిరుపతి అర్బన్ పరిధిలో దరఖాస్తులు ఎక్కువగా దాఖలయ్యాయి. గూడూరు, శ్రీకాళహస్తి డివిజన్‌లో ప్రతి మద్యం దుకాణానికి దరఖాస్తులు దాఖలైనప్పటికీ ఇతర ప్రాంతాల తరహాలో ఎక్కువగా నమోదు కాలేదు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ ఆదాయానికి గండిపడే అవకాశాలు గుర్తించిన ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులు పెరిగేలా కృషి చేస్తున్నారు.

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 18 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. మంగళవారం శ్రీవారిని 82,043 మంది దర్శించుకున్నారు. రూ.4.10 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

టెట్‌కు 2,462 మంది హాజరు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం నాలుగు కేంద్రాల్లో జరిగిన టెట్‌కు మొత్తం 2,462 మంది హాజరయ్యారు. ఉదయం 1,336 మందికిగాను 1,229 మంది, మధ్యాహ్నం 1,336 మందికిగాను 1,233 మంది హాజరయ్యారు.

రైలుబండి.. వేళకు రాదులేండి..!

ప్రయాణికులకు తప్పని పడిగాపులు

శ్రీవారి భక్తులకు పలు రైళ్లు చుక్కలు చూపిస్తున్నాయి. వేళకు రాకపోవడంతో గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ప్రాంగణంలో జరుగుతున్న ఆధునికీకరణ పనులతో అసలే వసతులు కొరవడగా సమస్యను రోజుల తరబడి పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే,తిరుపతి (రైల్వే)

తిరుపతి రైల్వే స్టేషన్ మీదుగా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. తిరుమల, తిరుపతి దర్శనార్థం వచ్చి వెళ్లే యాత్రికులు, పర్యటకుల ప్రయాణానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా తిరుపతి నుంచి నెల్లూరు, కావలి, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం మీదుగా, అలాగే రేణిగుంట, కడప, నంద్యాల, కర్నూలు, సికింద్రాబాద్ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లు ఆలస్యంగా వస్తున్నాయి. శబరి, కృష్ణా, హౌరా, సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు సమయానికి చేరుకోవడం లేదు.

ఆలస్యంగా నడిచే రైళ్లు...

- కేరళ సూపర్‌ఫాస్ట్ (12625) తిరుపతి రైల్వే స్టేషన్‌కు ప్రతి రోజూ ఉదయం 04:50 గంటలకు రావాల్సి ఉండగా.. ఈనెల నాలుగో తేదీన గంట, ఐదో తేదీన ఏకంగా రెండు గంటల పైగా ఆలస్యమైంది.
- ఎస్ఎంవీబీ హౌరా ఎక్స్‌ప్రెస్ (12864) తిరుపతి స్టేషన్‌కు రోజూ 16:05 గంటలకు చేరుకోవాల్సి ఉండగా, ఈనెల 5న పదిహేను నిమిషాలు, ఆరు ఏడో తేదీల్లో నాలుగు గంటలు పైగా ఆలస్యంగా చేరుకుంది.
- శేషాద్రి ఎక్స్‌ప్రెస్(17209) రోజూ సాయంత్రం 17:15 గంటలకు రావాల్సి ఉండగా.. 6, 7 తేదీల్లో 34 నిమిషాలు ఆలస్యమైంది.
- కృష్ణా (17405), శబరి (17229) ఎక్స్‌ప్రెస్‌లదీ ఇదే పరిస్థితి.


వారంరోజుల్లో యథావిధిగా రాకపోకలు.. గతనెలలో విజయవాడ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చిన వరదల ప్రభావం రైళ్లపై ఇంకా కొనసాగుతోంది. రాత్రి సమయాల్లో నడిచే పలు రైళ్లు, వాటికి అనుసంధానంగా నడుస్తున్నవి ఆలస్యమవుతున్నాయి. కొన్నిచోట్ల ట్రాక్ మరమ్మతులు జరుగుతున్నాయి. వారంరోజుల్లో యథావిధిగా రాకపోకలు సాగుతాయి.

- చిన్నప్పరెడ్డి, స్టేషన్ మేనేజర్

బ్రహ్మోత్సవం.. భక్తోత్సవం

◆ గరుడోత్సవం నిర్వహణలో సఫలం ◆ తితిదే ఏర్పాట్లపై హర్షాతిరేకాలు

ఈనాడు-తిరుపతి; తిరుమల, న్యూస్‌టుడే: వీఐపీల తాకిడి లేదు.. ప్రజాప్రతినిధుల హడావుడి లేదు. సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనమే పరమావధిగా గరుడ వాహన సేవ అంబరాన్నంటిన వేళ శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈసారి ప్రత్యేక చాటాయి. భక్తుల మన్ననలు అందుకున్నాయి. పాలకమండలి లేకున్నా ఉన్నతాధికారులు కొత్తగా బాధ్యతలు చేపట్టినా కీలకమైన గరుడోత్సవంలో మూడు లక్షల మందికిపైగా భక్తులకు సంతృప్తికర దర్శనం కల్పించారు. పారిశుద్ధ్యం, భద్రత, రద్దీ నియంత్రణ చర్యలతో మెప్పించారు.




సమన్వయంతో సాగి..

శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఏటా గరుడ వాహన సేవను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు వస్తుంటారు. ఈ దఫా సుమారు 3.5 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగానే ఏర్పాట్లు చేశారు. మాడవీధుల్లో రెండు లక్షల మంది వరకు భక్తులకు ఏర్పాట్లు చేశారు. అదనంగా సుపథం, నైరుతి, వాయువ్యంతో పాటు వెంగమాంబ అన్నదాన సత్రం వద్ద నుంచి మాడవీధుల్లో వాహనానికి ఇరువైపులా తాళ్లు ఏర్పాటు చేసి భక్తులను వరుస క్రమంలో అనుమతించారు. ఇలా ఒక్కో ప్రాంతంలో గంటపాటు భక్తులను అనుమతించడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకునే వీలుకలిగింది. తూర్పు మాడవీధి, వాహన మండపం నుంచి హథీరాంజీ బాబా మఠం వద్దకు వెళ్లగానే ఆలయం ఎదురుగా గ్యాలరీల్లోని భక్తులను ఖాళీ చేయించి మళ్లీ నింపారు.

కోరినంత ఆహారం

సామాన్య భక్తులకు, గ్యాలరీల్లోని భక్తులకు పూర్తిస్థాయిలో గతంలో ఆహారాన్ని అందించలేకపోయేవారు. ఈ పర్యాయం ప్రతి 5 నిమిషాలకు గ్యాలరీల్లోని భక్తులకు అన్న ప్రసాదాలు, పాలు, కాఫీ, ఉప్మా, బాదం పాలు, బిస్కెట్లను అందించారు. భక్తులే ఇక చాలు అనే పరిస్థితి కనిపించింది. ఒక్క గరుడ సేవ రోజునే ఏకంగా నాలుగు లక్షల మంచినీటి సీసాలను పంపిణీ చేశారు.



◆ ప్రస్తుత గరుడోత్సవంలో వీవీపీలు, రాజకీయ నాయకుల రద్దీని అధికారులు పూర్తిగా నియంత్రించారు. గతంలో గరుడోత్సవానికి భారీగా వీవీపీల తాకిడితో వాహన సేవ ఎదుట హడావుడి నెలకొనేది. పాలకమండలి పెద్దలు పోటీలు పడి వారి సేవలో తరించేవారు. వారి తీరుతో అక్కడ పనిచేసే భద్రతా సిబ్బంది, భక్తులకు ఇబ్బందులు తప్పేవి కావు.

అందరికీ అభినందనలు

గరుడ సేవను విజయవంతంగా నిర్వహించిన అన్ని విభాగాల అధికారులను తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అభినందించారు. ప్రణాళిక, అన్ని విభాగాల సమన్వయంతో భక్తులకు సంతృప్తికర దర్శనం కల్పించినట్లు పేర్కొన్నారు. బ్రేక్ దర్శనాల రద్దు చేయడంతో సామాన్య భక్తులు ఎక్కువ సంఖ్యలో స్వామిని దర్శించుకున్నట్లు చెప్పారు.

45 వేల మందికి జియో ట్యాగింగ్

బ్రహ్మోత్సవాల్లో చిన్నపిల్లలు, వృద్ధులు, వికలాంగులు తప్పిపోకుండా పోలీసులు జియో ట్యాగింగ్ చేపట్టారు. మొత్తం 45 వేలమంది మంది పిల్లలకు జియోట్యాగింగ్ చేసినట్లు జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జి, అదనపు ఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలోని బృందం సభ్యులు బుధవారం తప్పిపోయిన చిన్నారులు చెందిన కె.రుషిక(8), తమిళనాడు, ధర్మపురికి చెందిన యాదవ్(8), హైదరాబాద్, అంబర్‌పేటకు చెందిన హనీ(8)లను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

82 వేల మందికి..

◆ గరుడసేవ రోజున ఏకంగా 82,043 మంది భక్తులు శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకోగా 30,100 మంది తలనీలాలు సమర్పించారు.

◆ 2023 శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో 4 వేల మందితో భద్రతా చర్యలు చేపట్టగా, ప్రస్తుతం 5 వేల మందితో చేపట్టారు. గరుడోత్సవంలో గతంలో 1130 మంది, ప్రస్తుతం 1250 మందిని వినియోగించారు.

◆ మాడవీధుల్లో గతంలో 07 అంబులెన్సులు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం 11 ఉంచారు. గుండె సంబంధిత రోగుల కోసం అలిపిరి, శ్రీవారి నడక మార్గంలో మొదటిసారిగా స్విమ్స్ కార్డియాక్ వైద్యులతో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

◆ శ్రీవారి సేవకులను గతంలో 3 వేల మందిని వినియోగించగా ప్రస్తుతం 4 వేల మందితోపాటు వెయ్యి మంది శ్రీవారి సేవకులను అదనంగా వినియోగించారు.

◆ మాడవీధుల్లోని 180 గ్యాలరీల్లో గతంలో 8 మంది సెక్టోరల్ అధికారులను నియమించగా ప్రస్తుతం 49కి పెంచారు. సిబ్బంది గతంలో 360 మంది ఉండగా ప్రస్తుతం 563 మందికి పెంచారు.



వస్త్రాలు అందిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు.. చిత్రంలో ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

శ్రీవారి ఆలయ సిబ్బందికి వస్త్ర బహుమానం

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న వారికి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు వస్త్ర బహుమానం చేశారు. స్వామి వైభవోత్సవ మండపంలో తితిదే ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి వారు శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహన బేరర్లు, మేళం సిబ్బందికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో సిబ్బందికి వస్త్ర బహుమానం అందిస్తున్నట్లు చెప్పారు. తితిదే సీవీఎస్‌వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాణ ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, సినీ నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, ఏపీ సీఎం సెక్రటరీ ఎ.వి.రాజమౌళి తదితరులు దర్శించుకున్నారు.




ఆలయం ఎదుట ఏపీ సీఎం కార్యదర్శి ఎ.వి.రాజమౌళి

అరెస్టులంటూ.. గాలం

సైబర్ నేరాలు పెరుగుదల | **ఖాళీ అవుతోన్న బాధితుల ఖాతా**

సైబర్ నేరాల తీవ్రత అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో రోజుకో వేషంతో మోసం చేస్తున్నారు. మన అమాయకత్వం, అలక్ష్యాన్ని అవకాశంగా మలుచుకుంటున్నారు. పెట్టుబడి.. ఉద్యోగ అవకాశాలు, ఇంటి నుంచే సంపాదన అంటూ బోల్తా కొట్టిస్తున్నారు. మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు, చివరకు ఐపీఎస్‌లు బాధితులుగా మారుతున్నారు. బాధితులు పోగొట్టుకున్న సొమ్ము అంతకంతకూ పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం)



కేసులంటూ బెదిరించి..

గతనెల ఆరో తేదీన తిరుపతికి చెందిన ఓ వ్యక్తికి ముంబయి డీహెచ్‌ఎల్ కొరియర్ మేనేజర్ అంటూ ఫోన్ వచ్చింది. మీ పేరు, ఆధార్ వివరాలతో ముంబయి నుంచి తైవాన్‌కు పార్సిల్ బుక్ చేశారు.. అందులో డ్రగ్స్, ఐదు పాస్‌పోర్టులు, క్రెడిట్ కార్డులు ఉన్నాయి. పార్సిల్‌ను సైబర్ పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారంటూ ఆ విభాగం ఎస్సైని అంటూ కాల్ అనుసంధానం చేశారు. ముంబయి యాంటీ నార్కోటిక్ అనే క్రిమినల్ మీ ఆధార్ వివరాలతో 24 బ్యాంకు ఖాతాలు తెరిచి లావాదేవీలు జరిపారని, మీకు 15 శాతం కమిషన్ ఇస్తున్నారని బెదిరించారు. విచారణలో నిజానిజాలు తేల్చాలనుకుంటూ మూడు సార్లు రూ.6.25 లక్షలు జమ చేయించుకున్నారు. చెక్ ద్వారా మరింత నగదు పంపాలని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు.

ఏపీకే యాప్‌లతో..

వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో ఏపీకే ఫైల్స్‌తోపాటు లింకులు ఎక్కువగా వస్తున్నాయి. పొరపాటున వాటిని క్లిక్ చేస్తే మీ ఫోన్ కంట్రోల్ (ఏనీ డెస్క్) మొత్తం అవరి చేతుల్లోకి వెళ్తుంది. స్నేహితులు, బంధువులకు మీరు పంపినట్లుగా సమాచారం చేరవేసి డబ్బు కాజేస్తారు. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా దోచుకుంటారు.

తిరుపతికి చెందిన ప్రముఖ వ్యక్తి చరవాణికి 'తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందాలనుకుంటున్నారా.. అయితే ఈ లింక్ క్లిక్ చేయండంటూ' ఓ మెసేజ్ వచ్చింది. అందులో కొంత పెట్టుబడి పెట్టగా రెట్టింపు కలిపి ఖాతాకు జమైంది. ఇలా నాలుగైదు దశల్లో ఆదాయం చూపి రూ. పది వేలు దాటిన పెట్టుబడులకు టెలిగ్రామ్ లింకును పంపారు. ఏకంగా రూ.96 లక్షలు దోచేయగా తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో వారు రూ.37 లక్షలు రికవరీ చేయగలిగారు.

అపరిచిత కాల్స్‌తో అప్రమత్తంగా ఉండండి

అపరిచిత కాల్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత పిన్ నంబరు, ఓటీపీలు షేర్ చేయొద్దు. కమిషన్లకు కక్కుర్తిపడి అనుమానిత ఖాతాలకు డబ్బు తరలించడం, రిజిష్టర్ కాని సంస్థల్లో పెట్టుబడులు ఏమాత్రం క్షేమం కాదు. సైబర్ నేరాలకు గురైనట్లు గుర్తించిన వెంటనే 1930 ను సంప్రదించాలి. సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ ద్వారానూ ఫిర్యాదు చేయవచ్చు. – సుబ్బరాయుడు, ఎస్పీ



సరస్వతిగా చెంగాళమ్మ



సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: చెంగాళమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారు సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సాయి నగర్, పరమేశ్వరినగర్, మహదేవయ్యనగర్, ఝాన్సీ నగర్, సంజీవయ్య నగర్, ఇందిరానగర్ వాసులు దసరా సారె సమర్పించారు.

రుద్రాణీ.. రక్తబీజ సంహారిణి



అసుర సంహారానికి శ్రీకారం చుట్టిన జ్ఞానాంబిక ఉగ్రరూపంతో రక్తబీజుని సంహరించింది. శ్రీదేవీ నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జ్ఞానాంబిక ఉగ్రరూపిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ఆయుధాలతో రక్తబీజుని వధించే రీతిలో అమ్మవారికి అలంకరణలు చేపట్టారు. ఆలయంలోని అలంకార మండపం నుంచి బాలజ్ఞానాంబిక ఆలయం వరకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి ధూప, దీప, నివేదనలు సమర్పించారు. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

మహా పాదయాత్రతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్



ధ్రువపత్రం చూపుతున్న వీరేంద్రచౌదరి తదితరులు

తిరుపతి (భవానీనగర్) న్యూస్‌టుడే: రామన్న-వెంకన్న మహాపాదయాత్ర పేరుతో ఇప్పటివరకు ఏడు సార్లు భద్రాచలం నుంచి తిరుమల శ్రీవారి సన్నిధికి కాలినడక వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నట్లు డా.గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 19న 11 మందితో మహా పాదయాత్రను ప్రారంభించి, ఈనెల అక్టోబరు 7న తిరుమలకు చేరుకున్నట్లు ఆయన చెప్పారు. 619 కి.మీ దూరాన్ని 19 రోజుల్లో చేరుకోవడంతో 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో తన పేరు నమోదు అయ్యిందన్నారు. స్వామివారి దర్శనానంతరం శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి పుష్కర్ కుమ్ర వీరేంద్రచౌదరికి ధ్రువపత్రం అందజేసి సత్కరించారు.

విద్యుత్తుశాఖ చిత్తూరు తొలి ఎస్ఈగా ఇస్మాయిల్‌అహ్మద్

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు విద్యుత్తు శాఖ సర్కిల్ కార్యాలయం తిరుపతిలో ఉండేది. వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సేవలు అందించాలనే సంకల్పంతో సర్కిల్‌ను రెండుగా విభజించింది. చిత్తూరులో విద్యుత్తు శాఖ సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నూతన సర్కిల్ కార్యాలయం తొలి ఎస్ఈగా ఎస్.కె.ఇస్మాయిల్ అహ్మద్‌ను నియమిస్తూ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో వాణిజ్య విభాగం జీఎంగా పనిచేస్తున్న ఆయన్ను చిత్తూరు ఎస్ఈగా నియమించారు. ఉమ్మడి జిల్లా ఎస్ఈ సురేంద్రనాయుడిని తిరుపతి జిల్లా సర్కిల్ ఎస్ఈగా నియమించారు. నూతన సర్కిల్ కార్యాలయానికి కొత్తగా కేటాయించిన ఈఈలు, డీఈఈలు, ఏఈలు, జేఈఈలు, ఇతర అధికారులను త్వరలో నియమించనున్నారు. వీలైనంత త్వరగా చిత్తూరులో ఎస్ఈ కార్యాలయాన్ని ప్రారంభించడానికి అధికారులు వేగంగా కసరత్తు చేపడుతున్నారు.

'సిట్‌ను ప్రభావితం చేసేలా వ్యాఖ్యలు'

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదాల్లో కల్తీ నెయ్యి అంశాన్ని తేల్చేందుకు సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్‌ను ప్రభావితం చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీ పర్యటన జరిగిందని తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతిలోని తన నివాసంలో బుధవారం ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రధాని మోదీకి శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తూ.. ఇది కల్తీ లడ్డూ కాదని, సిసలైన నెయ్యితో తయారు చేశారని చెప్పి శ్రీవారి ప్రసాదాలపై మరోమారు అభాండాలు వేసేలా వ్యాఖ్యలు చేశారన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	241
లేయర్ మాంసం	187

రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ



తొట్టంబేడు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పసుపులేటి ఉమ ఎంపికైంది. ఇటీవల విశాఖ జిల్లా వనపర్తి వేదికగా జరిగిన అంతర్ జిల్లా జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-19 విభాగంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా ఉమను కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పీడీ నరసింహారావు, కోచ్ స్వప్న, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహిళా వర్సిటీ (తిరుపతి): శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఇంటిగ్రేటెడ్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల కార్యాలయం సంచాలకురాలు సువర్ణలతాదేవి బుధవారం పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, బి.ఒకేషనల్ న్యూట్రిషన్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అప్పరల్ డిజైన్, బ్యాచిలర్స్ ఆఫ్ సైన్స్ ఇన్ స్టాటిస్టిక్స్, సోషల్ వర్క్, మాస్టర్స్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

12న స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యవిభాగం): విజయదశమి సందర్భంగా ఈ నెల 12వ తేదీన స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు సంచాలకులు డాక్టర్ ఆర్‌వీ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు యథాతథంగా ఉంటాయన్నారు. ప్రజలు, రోగులు సహకరించాలని కోరారు.

'వాహన్' సాఫ్ట్‌వేర్‌పై అవగాహన

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప జోన్ పరిధిలోని రవాణాశాఖ అధికారులు 'వాహన్' సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కలిగి ఉండాలని జేటీసీ కృష్ణవేణి పేర్కొన్నారు. కడప శివారులోని డీటీసీ కార్యాలయంలో ఎనిమిది జిల్లాల డీటీసీలు, ఆర్టీవోలు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొత్తగా వచ్చిన సాఫ్ట్‌వేర్ వినియోగం, లోపాలపై అధికారులతో సమీక్షించారు. కృష్ణవేణి మాట్లాడుతూ 'వాహన్'తో దేశంలో ఎక్కడ కొనుగోలు చేశారు, కేసులు తదితర అంశాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. డీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి(కడప), శాంతకుమారి(కర్నూలు), వీర్రాజు(అనంతపురం), నిరంజన్‌రెడ్డి(చిత్తూరు), ఆర్టీవోలు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

రేణిగుంట, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు... రేణిగుంట నుంచి చెన్నై వైపు పెట్రోల్ బంకు సమీపంలో నడిచి వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొని వెళ్లింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుంది. పసుపు రంగు టీషర్టు, దానిపై నీలం అడ్డగడులు, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం రుయాకు తరలించామని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



కార్తీక్ (పాతచిత్రం)

కోట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన ప్రమాదంలో కోటకు చెందిన కార్తీక్(22) మృతి చెందాడని ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. కార్తీక్ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఇతను.. బుధవారం స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై విద్యానగర్‌కు బయలుదేరారు. ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం విద్యానగర్ సమీపంలోని ర.భ.రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. అక్కడే ఉన్న రక్షణ గోడను ఢీకొంది. తీవ్ర గాయాలైన కార్తీక్‌ను కోటలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో గూడూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. స్నేహితుడికి గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

క్యాన్సర్ కేసుల నమోదు ఆందోళనకరం



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రశాంత్ పెనుమాడు

తిరుపతి(పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: ప్రపంచవ్యాప్తంగా గడిచిన మూడు దశాబ్దాల కాలంలో 50 సంవత్సరాల లోపు వారిలో 79% క్యాన్సర్ కేసులు నమోదు అవుతుండటం ఆందోళనకరం అని శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పెనుమాడు అన్నారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డా. ఎం.వి.రమణ అధ్యక్షతన బుధవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డా.ప్రశాంత్ పెనుమాడు పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. మారుతున్న జీవన శైలి కారణంగా లింగభేదం తేడా లేకుండా పలువురు క్యాన్సర్ల బారిన పడుతున్నారన్నారు. ముందస్తు అవగాహనతో క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి బాలసుబ్రహ్మణ్యం, స్వీకార్ డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ రమేష్‌బాబు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ హేమంత్ కుమార్, దంత వైద్యులు డా. వెంకయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.


నకిలీ నగలు కుదువపెట్టి మోసానికి పాల్పడిన ఆరుగురి అరెస్టు



అరెస్టయిన నిందితులు

తిరుత్తణి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లా విజయపురం మండలం మల్లారెడ్డి కండ్రిగకు చెందిన వెంకటయ్య, లత (48) భార్యాభర్తలు. లత.. కనకమ్మసత్రంలో రేఖ అనే మహిళకు చెందిన నగల కుదువ దుకాణంలో గత నెల 22వ తేదీ 29 గ్రాముల బంగారు నగలను కుదువపెట్టి రూ.1.25 లక్షలు తీసుకుంది. మూడు రోజుల క్రితం అదే కుదువ దుకాణంలో 20 గ్రాముల నగలు కుదువపెట్టి రూ.90 వేలు తీసుకుంది. అనుమానంతో దుకాణ యజమాని ఆ నగలను పరీక్షించగా నకిలీవని తెలిసింది. దీంతో కనకమ్మసత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి లతను అరెస్టు చేశారు. దర్యాప్తులో పలు కీలక విషయాలు తెలియడంతో పూర్తిస్థాయి దర్యాప్తునకు తిరుత్తణి డీఎస్పీ శ్రీనివాస పెరుమాళ్ ఆదేశించారు. ప్రత్యేక పోలీసు బృందం అన్నమయ్య జిల్లా మదనపల్లెకి చెందిన రామాంజనేయులు (50), పుత్తూరుకు చెందిన చంద్రశేఖర్ (39)ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు జరిపింది. వారిద్దరూ గ్రామీణ ప్రాంతాల్లో వాయిదాల పద్ధతిలో గృహోపయోగ వస్తువులు, గోల్డ్ కవరింగ్ నగలను విక్రయించి మహిళలతో పరిచయాలను పెంచుకున్నారని, డబ్బు ఆశ చూపి వారి ద్వారా నకిలీ నగలను ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని పలు కుదువ దుకాణాల్లో, ప్రైవేటు బ్యాంకుల్లో కుదువపెట్టి కోట్లాది రూపాయలు తీసుకుని మోసానికి పాల్పడినట్లు తెలిసింది. ఇలా మోసానికి పాల్పడిన రేణిగుంటకు చెందిన హరిత (34), తిరుత్తణి సమీప వీకేఎన్ కండ్రిగైకు చెందిన రేఖ (35)ను అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నలుగురు స్మగ్లర్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, అదుపులోకి తీసుకున్న స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ బలగాలు

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బలగాలు చిత్తూరు సమీపంలోని సంతపేట అటవీ ప్రాంతంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో నలుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. ఆర్ఎస్సైలు కె.సురేష్‌బాబు, వై.విశ్వనాథ్ బలగాల ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు.

ఒంటరి మహిళపై దాడి.. నగదు, నగల దోపిడీ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఒంటరి మహిళపై ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడి నగలు, నగదు దోపిడీ చేసిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్లగుంట సంజయ్‌గాంధీ కాలనీలో సాయమ్మ(67) నివాసం ఉంటోంది. ఆమెకు భర్త, పిల్లలు లేరు. మంగళవారం అర్ధరాత్రి ఇంటి తలుపులు తెరిచి నిద్రిస్తున్న సయయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై దాడి చేశారు. ఇంట్లోని 7 తులాల బంగారు ఆభరణాలు, రూ.7 లక్షల నగదు తీసుకెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తిరుపతి
•తిరుపతి •చంద్రగిరి

నేటి నుంచి శిల్పారామంలో దసరా వేడుకలు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరులోని శిల్పారామంలో గురువారం నుంచి నాలుగు రోజులపాటు దసరా వేడుకల పేరుతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పరిపాలనాధికారి ఖాదర్‌వల్లి తెలిపారు. బుధవారం శిల్పారామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక, జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ నెల 11న సాయంత్రం ఆరు గంటలకు దాండియా నృత్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగర ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్యదర్శులకు సూపరింటెండెంట్ హోదా

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో విలీనమైన రాజీవ్‌నగర్, శెట్టిపల్లె పంచాయతీల కార్యదర్శులు కె.నాగేంద్ర ప్రసాద్, కె.సురేంద్రరావుకు సూపరింటెండెంట్ హోదా కల్పిస్తూ పురపాలక కార్యదర్శి నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇకపై వారు జీతభత్యాలు నగరపాలక సంస్థ నుంచి పొందేలా ఆదేశాలు వెలువడ్డాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే:

సమస్య: గాంధీపురం పంచాయతీ శ్రీనగర్‌కాలనీలోని రెండో క్రాస్‌లో మట్టి రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయంగా మారుతోంది. మరమ్మతులు చేయాలి.

- మోహన్‌రావు, శ్రీనగర్‌కాలనీ

సమాధానం: రోడ్డును పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

- విజయనిర్మల, కార్యదర్శి, గాంధీపురం

ట్యాంకు లీకులకు మరమ్మతు

స్పందనకు వందనం

చంద్రగిరి గ్రామీణ: అనంత గుర్రప్పగారిపల్లి ఎస్టీ కాలనీలో సిమెంట్ ట్యాంకుకు మరమ్మతులు చేశారు. అపరిశుభ్రంగా ఉండటం, లీకేజీలు పడటంతో ఇటీవల 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి మధు ట్యాంకును శుభ్రం చేసి లీకులు అరికట్టారు.

తిరుధామం.. కళానీరాజనం









రామ..బంటు సందడి











తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు బుధవారం కోలాహలంగా సాగాయి. ఉదయం హనుమంత, సాయంత్రం స్వర్ణ రథోత్సవం, రాత్రికి గజ వాహన సేవల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. హనుమంత వాహన సేవలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి 18 కళా బృందాలు, 468 మంది కళాకారులు పాల్గొన్నారు. రాత్రి జరిగిన గజవాహన సేవలో వివిధ రాష్ట్రాలకు చెందిన 16 కళా బృందాలు, 408 మంది కళాకారులు పాల్గొని స్వామివారికి కళానీరాజనం సమర్పించారు. స్థానిక నాద నీరాజనం వేదిక, ఆస్థాన మండపంలో తితిదే హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించాయి.

మాడవీధుల్లో తొలగని చెత్త



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయ మాడవీధుల్లో స్వామివారి వాహన సేవలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పెద్దయెత్తున భక్తులు తిరుమలకు తరలివస్తున్నారు. ఇదే సమయంలో మాడవీధుల్లో చేరిన వ్యర్థాలను సకాలంలో తరలించకపోవడంతో వాహన సేవల సమయంలో భక్తులకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు దృష్టిసారించి సకాలంలో తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి లెఫ్టినెంట్ హోదా



ఎన్‌సీసీ సీటీవో
కె.ఈశ్వరబాబు

పాకాల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు, పీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న కె.ఈశ్వర్ బాబుకు లెఫ్టినెంట్ హోదా లభించింది. కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకింగ్ అధికారి (సీటీవో)గా బాధ్యతలు స్వీకరించిన ఆయన మహారాష్ట్రలోని నాగపూర్ ఎన్‌సీసీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 75 రోజులు శిక్షణ పొందారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో అకాడమీ కమాండెంట్ మేజర్ జనరల్ కపిల్ జిత్ రాథోడ్ సమక్షంలో బుధవారం ఈ హోదా పొందారు. కళాశాల ప్రిన్సిపల్ మొహిద్దీన్ బాషా, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

తిరుపతి(భవానీనగర్)న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని ఆయనపై విమర్శలు చేయడం తగదని తెదేపా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతికి నిధులు తేవడంలో గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు. శ్రీవారి పేరుతో జరిగిన దోపిడీ, లడ్డూ కల్తీ విషయంలోని నిజాలు నిగ్గు తేలుతాయన్నారు. సమావేశంలో ఆర్‌సీ మునికృష్ణ, చేజర్ల మనోహరాచారి, యశ్వంత్‌రెడ్డి, చెంగయ్య పాల్గొన్నారు.



తెదేపా నేతలతో కలిసి మాట్లాడుతున్న నరసింహ యాదవ్

అక్రమ నిర్మాణాలు తొలగించండి



రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: భాకరాపేట గ్రామంలోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని కూటమి నాయకులు రెవెన్యూ అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైకాపా హయాంలో గ్రామంలో సర్వే నంబరు 329, 341, 342, 629, 368, 630లో అక్రమంగా ఇళ్లు నిర్మించడంతోపాటు నకిలీ పట్టాలు సృష్టించారన్నారు. మోడల్ కాలనీలో ఏర్పాటు చేసిన ఆట స్థలాన్ని సైతం ఆక్రమించారని ఆరోపించారు. నాయకులు దామోదరం, అసనాపురం మణి, లోకనాథం పాల్గొన్నారు.

తిరుపతి ఇన్‌ఛార్జి ఆర్డీవోగా రామ్మోహన్

తిరుపతి (రెవెన్యూ), న్యూస్‌టుడే: తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)గా బి.రామ్మోహన్ నియమితులయ్యారు. కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగం ప్రత్యేక కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు తిరుపతి ఆర్డీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

టైమ్స్ ర్యాంకింగ్‌లో రాణింపు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్స్- 2025లో తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రత్యేక గుర్తింపు సాధించింది. '1201-1500' పరిధిలో ఉత్తమ ర్యాంక్ నమోదు చేసుకున్నట్లు వీసీ ఆచార్య అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఎం.భూపతి నాయుడు మాట్లాడుతూ ఈ విజయం అకడమిక్, రీసెర్చ్ ఎక్సలెన్స్‌కు నిబద్ధతకు నిదర్శనమని, భవిష్యత్తులో వర్సిటీని అన్ని విభాగాల్లో అగ్రభాగాన నిలిపేందుకు ప్రయత్నిస్తామన్నారు.

ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు, ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ఏసీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కస్తూరికి గతంలో ఉన్న విధులు అలాగే కొనసాగించారు. ఏఈవోలు హేమమాలినికి ఆలయ రెండో షిఫ్టు బాధ్యతలు అప్పగించారు. మరికొందరు బదిలీ అయినవారిలో ఉన్నారు.

వైభవంగా.. దేవీ నవరాత్రులు



పాకాల: నేంద్రగుంటలో సరస్వతీదేవి అలంకారం



జీవకోన: అన్నపూర్ణేశ్వరిగా తిరుపతి గ్రామదేవతల్లో ఒకరైన శ్రీబొంతాలమ్మ



రామచంద్రాపురం: శ్రీసరస్వతీ దేవి అలంకరణలో శ్రీదుర్గాదేవి

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చంద్రగిరిలో హంస వాహనంపై సరస్వతీదేవి రూపంతో శ్రీమిట్ట గంగమ్మతల్లి పురవీధుల్లో విహరించారు.

❖ తుమ్మలగుంటలో హనుమంత, గజ వాహనాలపై మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

- న్యూస్‌టుడే బృందం



తిరుపతి (గ్రామీణ): చెంచులక్ష్మి కాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం చేస్తున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్ దివాకర్‌రెడ్డి



సరస్వతి దేవి అలంకరణలో కొత్తవీధిలోని కన్యకా పరమేశ్వరి



చంద్రగిరి: హంస వాహనంపై శ్రీ మిట్టగంగమ్మ



మహేష్ కుమార్ గౌడ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ ప్రభంజనం మొదలు

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మన మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో బుధవారం తిరుపతి, చిత్తూరు జిల్లాల కాంగ్రెస్ పార్టీ, బీసీ సంఘాల సంయుక్తాధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభంజనం ప్రారంభమైందన్నారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంభూపాల్ రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు, తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో డీఈవో శేఖర్, తెదేపా నాయకుడు నారాయణ రెడ్డి

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయడం హర్షణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక యూత్ హాస్టల్లో 'సోషియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ' ఆధ్వర్యంలో 75 మంది పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా డీఈవో డాక్టర్ వి.శేఖర్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవ నారాయణ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సిర్డ్స్ సంస్థ ద్వారా పిల్లలకు సైకిళ్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్పీఎఫ్ కమాండెంట్ డీఎస్‌కే రాజు, సిర్డ్స్ సంస్థ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. మురుగు పారేదెలా..!

✹ విజయనగర్ కాలనీలో దోమల దండయాత్ర ✹ ఇబ్బందుల్లో స్థానిక ప్రజలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి మేజరు పంచాయతీ విజయనగర్ కాలనీ ఏర్పాటై దశాబ్దకాలం అవుతున్నా ఇప్పటి వరకు సరైన మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. ఇళ్లలోని మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు వీలులేకపోవడంతో ఎక్కడికక్కడ నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. 370 కిపైగా కుటుంబాలు నివసిస్తున్న కాలనీలో 1,650 మందికి పైగా జనాభా ఉంటున్నారు. కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప.. గెలిచాక ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విజయనగర్ కాలనీలో కాలువల దుస్థితి

విష పురుగులకు ఆవాసంగా..

మురుగు కాలువలపై పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో విష పురుగులకు ఆవాసంగా మారింది. దీంతో రాత్రి సమయాల్లో బయట సంచరించాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు దోమలు విజృంభించడంతో నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు పిచ్చిమొక్కలు తొలగించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

నివేదికలు రూపొందించాం

విజయనగర్ కాలనీ ఏర్పాటు అయినప్పటి నుంచి మురుగు కాలువలు ఏర్పాటు చేయలేదు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు కాలువల ఏర్పాటుకు నివేదికలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- మహేశ్వరయ్య, ఈ.వో, చంద్రగిరి పంచాయతీ



కోలుకున్న రోగితో వైద్యులు

రుయాలో క్లిష్టమైన శస్త్రచికిత్స

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రుయా ఆస్పత్రిలో వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు పేర్కొన్నారు. వెంకటగిరికి చెందిన రమణమ్మ (62) తీవ్రమైన ఆయాసం, దగ్గు సమస్యతో రెండు వారాల కిందట రుయా ఆస్పత్రికి వచ్చారు. పరీక్షల అనంతరం ఎడమ ఊపిరితిత్తుల్లో అరుదైన ఫంగల్ బంతి వ్యాధికి కారణంగా గుర్తించారు. తక్షణం క్లిష్టమైన శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. ఛాతీ వైద్య విభాగాధిపతి డా.సుబ్బారావు, గుండె ఊపిరితిత్తుల శస్త్ర చికిత్స విభాగాధిపతి డా.కల్యాణి రమ, మత్తుమందు విభాగాధిపతి డా.రాధ, వైద్యులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని పారా మెడికల్, నర్సింగ్ సిబ్బంది సహకారంతో శస్త్రచికిత్స చేసి ఫంగల్ బంతిని విజయవంతంగా తొలగించారు. త్వరలో రోగిని డిశ్చార్జ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

17 దుకాణాలకు 82 దరఖాస్తులు

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి ఎక్సైజ్ శాఖ పరిధిలో 17 మద్యం దుకాణాల ఏర్పాటుకు లైసెన్సు పొందటానికి మరో రెండు రోజులపాటు దరఖాస్తులు చేసుకోవచ్చని సీఐ కేవీఎస్ ఫణీంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14న లాటరీ తీసి లైసెన్సులు ఖరారు చేస్తామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానంతో మొత్తం 82 దరఖాస్తులు అందాయన్నారు.

ఎస్వీయూ గ్రంథాలయంలో సరస్వతీ పూజ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆవరణలోని గ్రంథాలయంలో బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. నవరాత్రుల్లో ఆనవాయితీగా నిర్వహించే పూజా కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ విభాగాధిపతి ఆచార్య కొంగర సురేంద్రబాబు, వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలపై కమిషనర్ సమీక్ష

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: పీఎం స్వనిధి పథకంలో భాగంగా అందించే రుణాలకు అర్హులైన వారికి వెంటనే అందించాలని నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో ఆమె బ్యాంకర్లు, మెప్మా అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వారంలోపు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని మెప్మా అధికారులను ఆదేశించారు.

బాధ్యతల స్వీకరణ



నగరపాలక కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన ఎస్ఈ శ్యాంసుందర్

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక నూతన సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా శ్యాంసుందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎస్ఈ టి.మోహన్ బదిలీపై నెల్లూరు ప్రజారోగ్య శాఖ ఎస్.ఈగా వెళ్లారు. ఆయన స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ ఎస్.ఈగా పనిచేస్తున్న శ్యాంసుందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్యను మర్యాదపూర్వకంగా కలిశారు. బదిలీపై వెళ్తున్న ఎస్.ఈ. మోహన్‌ను పలువురు ఉద్యోగులు సత్కరించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో 20 మందికి జరిమానా

తిరుపతి (లీగల్): నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 20 మంది వాహన చోదకులకు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెలువరించినట్లు కోర్టు పర్యవేక్షకులు సుబ్బారెడ్డి, కోర్టు పోలీసు గిరి సంయుక్తంగా తెలిపారు. డీఎస్పీ రామకృష్ణ ఆచారి పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసు నమోదు చేశారు.

మద్యం దుకాణం వద్దని వినతి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం సాయినగర్‌లో మద్యం దుకాణం వద్దంటూ ఆ పంచాయతీ సర్పంచి డీవీ రమణ విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో డీపీవో సుశీలాదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి •సత్యవేడు

క్రెడిట్ సొసైటీ కార్యక్రమాలపై వినతి



ఈవో చంద్రశేఖర్‌ఆజాద్‌ను కలిసిన రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తిరుపతిలోని బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి సంస్థ ప్రతినిధులు ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌ను కలిశారు. ఈవో కార్యాలయంలో బుధవారం ఆయన్ను కలసి పలు అంశాలను ఈవోకు వివరించారు. కార్యక్రమంలో సాధికార సమితి రాష్ట్ర సభ్యులు సి.హనుమంతరావు, ప్రసాద్‌రావు, హారిక, శేషగిరిరావు, జయలక్ష్మి, సాయి దీక్షిత్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పసిడి పతకం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన శ్రీశివసాయి యోగా సెంటర్ యోగా శిక్షకులు సుజాత రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. కర్నూలులో జరిగిన పోటీల్లో 45-55 సీనియర్ మహిళా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఆమె ఎంపిక కావడం పట్ల పట్టణంలోని యోగ అభ్యాసకులు, పట్టణ ప్రముఖులు సుజాతకు అభినందనలు తెలిపారు.



పతకంతో సుజాత

శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో ఆకస్మిక తనిఖీలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థం, నక్షత్రవనం, అక్కడున్న అతిథి గృహాలను సందర్శించి సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అతిథి గృహాలకు సంబంధించి సీఆర్‌వో కార్యాలయంతో పాటు ఆయా అతిథి గృహాల వద్ద గదులు తీసుకునే వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగం అధికారులకు సూచనలు చేశారు.



సంబరాలు చేసుకుంటున్న భాజపా నేతలు

మోదీతోనే హ్యాట్రిక్ విజయం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ సాగిస్తున్న ఆదర్శవంతమైన పాలనతో హరియాణాలో భాజపాకు హ్యాట్రిక్ విజయం దక్కిందని భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని స్థానిక భాజపా కార్యాలయం వద్ద బుధవారం విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కోలా ఆనంద్ మాట్లాడుతూ ఎగ్జిట్‌పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ అనూహ్య రీతిలో విజయం సాధించడంపై అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్‌బాబు, పుల్లయ్య, ప్రసాద్, అమర్నాథ్, బత్తినయ్య, వెంకటేశ్వర్లు, తిరుపాల్‌నాయుడు, సుబ్రహ్మణ్యంరాజు, ధర్మయ్య, కృష్ణయ్య, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న ప్రద్యుమ్న

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న కుటుంబ సభ్యులతో కలసి శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఈయనతో పాటు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆలయం తరఫున తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ ఈవో ఎస్.ఆర్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుంత.. తీరని చింత



పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మురుగునీటి కాల్వపై కల్వర్టుకు భారీ రంధ్రం పడింది. దీంతో అటువైపుగా వెళ్లే పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో పొరబాటున ఆదమరిస్తే కాళ్లు విరిగిపోవడం తథ్యమన్నట్లు గుంత ప్రమాదం పొంచి ఉంది. దీంతో అక్కడి నివాస గృహస్థులు అవస్థలు పడుతున్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

మూలనబడి.. శుభ్రత తడబడి

తుప్పుపట్టిన యంత్రాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ అమలు నేపథ్యంలో యంత్రాల ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు కొంత మేర పని భారం తగ్గించాలన్నది కేంద్ర ప్రభుత్వ సంకల్పం. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఆయా ప్రాంతాలను చెత్త రహితం చేయాలన్న లక్ష్యంతో ఒక్కో పురపాలక సంఘానికి దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో కంపాక్టర్, ట్రాక్టర్లు, రోడ్లు శుభ్రం చేసే యంత్రాలు, వ్యర్థాల తొలగింపునకు మినీ జేసీబీలు, తోపుడు బండ్లు, చెత్త కుండీలు ఇలా పలు రకాల యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఏళ్లుగా నిరుపయోగం: పుణ్యక్షేత్రంగా ఉన్న పురపాలక సంఘం కావడంతో ఇక్కడి ప్రాంతానికి మరింత ప్రాధాన్యత ఇచ్చి అవసరమైన యంత్రాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే వీటి నిర్వహణలో అధికారులు అవసరమైన శ్రద్ధ తీసుకోవడం లేదు. చిన్నపాటి మరమ్మతులైన వెంటనే సంబంధిత యంత్రాలను మూలనపడేస్తున్నారు. మరమ్మతులు చేపట్టడంలో ఆలస్యం కారణంగా ఎండకు ఎండి, వర్షానికి తడిసి తుప్పుపట్టి ఉపయోగం లేకుండా పోతున్నాయి. ఏళ్లు గడిచి పోవడంతో పురపాలక సంఘం కార్యాలయం పక్కనున్న ఖాళీ స్థలంలో అడ్డం తప్పనిస్తే ప్రయోజనం లేకుండా పోయింది.

పురపాలక సంఘ జనాభా 96,275 | వార్డుల సంఖ్య 35 | పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య 120

రోజువారీ చెత్త ఉత్పత్తి 65 మెట్రిక్ టన్నులు | రోజువారీ తరలింపు 60 మెట్రిక్ టన్నులు



పురపాలక సంఘ కార్యాలయం పక్కన తుప్పుపట్టి దుస్థితికి చేరిన యంత్రాలు

తప్పని భారం: యంత్రాలు అందుబాటులో లేక పోవడంతో పారిశుద్ధ్య కార్మికులకు పనిభారం తగ్గడం లేదు. చెత్త తొలగింపు చేపట్టడం కష్టసాధ్యంగా మారుతోంది. గతంలో రెండు షిఫ్ట్‌ల్లో పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు అధికారులు ఎంతో శ్రమిస్తున్నారు. ప్రస్తుతం అవసరమైన యంత్రాలు లేక పోవడంతో ఈ భారమంతా కార్మికులపై పడుతోంది. దీంతో మరింత ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా దుస్థితికి చేరిన యంత్రాలను బాగుచేసి చెత్తరహిత పట్టణం చేయడంలో అధికారులు, పాలకులు శ్రద్ధ వహించాల్సి ఉంది.

– న్యూస్‌టుడే, నాగలాపురం

సమస్య: నాగలాపురం పాఠశాలల సముదాయంవద్ద రహదారిపైనే చెత్తా చెదారాలు ఉంటున్నాయి. చెత్తకుండీ ఉన్నా ఫలితం అంతంతమాత్రమే. విద్యార్థులు, స్థానికులు, భక్తులు ముక్కు మూసుకుని దాటుకుని వెళ్లాల్సి వస్తోంది.

- పురుషోత్తం, నాగలాపురం

సమాధానం: రెండు రోజుల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్, సున్నంలను పిచికారీ చేయిస్తాను.

- చిన్నదురైసుధ, సర్పంచి, నాగలాపురం

– న్యూస్‌టుడే, ఏర్పేడు

సమస్య: మండలంలోని ఆమందూరు పంచాయతీ బీసీకాలనీలో మురుగు కాలువలు లేక పోవడంతో నివాసాల్లోని మురుగు వీధుల్లో ప్రవహిస్తోంది. ఈనీరు పాచిపట్టి దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- లోకేష్, స్థానికుడు

సమాధానం: సమస్య నాదృష్టికి వచ్చింది. మురుగు వీధుల్లో ప్రవహించకుండా చర్యలు తీసుకుని శుభ్రం చేయిస్తాం.

- గుణయాదవ్, సర్పంచి



శ్రీకాళహస్తి: పెన్నులు, పుస్తకాలతో ముత్యాలమ్మకు అలంకరణ ◆ కనకాచలంపై దుర్గాదేవికి విశేష అలంకరణలు ◆ వీణాపాణిగా దుర్గమ్మ ◆ మహాసరస్వతిగా పొన్నాలమ్మ

నారాయణవనం: సరస్వతీదేవిగా శ్రీకామాక్షమ్మ ◆ మీనాక్షీదేవిగా శ్రీఅవనాక్షమ్మ

అక్షర రూపిణి.. అభయప్రదాయిని



రేణిగుంట: కదం పాడి అలంకరణలో గంగమ్మ | నాగలాపురం: సురుటుపల్లిలో శివలింగ పూజాలంకరణలో మరగదాంబికాదేవి | వరదయ్యపాలెం: కొలువైన కామాక్షమ్మ | తొట్టంబేడు: సరస్వతీదేవిగా బంగారమ్మదేవి

శ్రీ దేవీ నవరాత్రి వార్షికోత్సవాల్లో భాగంగా అన్ని శక్తి ఆలయాల్లో అమ్మవార్లు మహాసరస్వతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరాలో సప్తమితో పాటు మూలా నక్షత్రం రోజున వీణాపాణిగా అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఈ సందర్భంగా అన్ని ఆలయాల్లోని అమ్మవార్లు శ్వేత వర్ణ శోభితంగా, వీణను ధరించి, పుస్తకాలు చేతపట్టి భక్తులకు దర్శనమిచ్చారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలంపై అమ్మవార్లకు ఉదయం, సాయంత్రం వేళల్లో విశేష అభిషేకాలు జరిపారు. ధూప, దీప, నివేదనలు సమర్పించారు.

- న్యూస్‌టుడే బృందం



ఏర్పేడు: గుడిమల్లంలో శ్రీఆనందవల్లీదేవి

చెత్త తొలగించారు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మండలంలోని రామచంద్రాపురం రహదారి పక్కన చెత్త నిల్వలు పేరుకు పోవడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 6వ తేదీన 'మేమున్నాం- మీకుతోడుగా' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో చెత్త నిల్వలను తొలగించి సమస్యను పరిష్కరించారు.

తీరిన హైవోల్టేజీ సమస్య

స్పందనకు స్పందన

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: స్థానిక ఎస్టీ కాలనీలో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రిక పరిధిలోని విద్యుత్ వినియోగదారులు హైవోల్టేజీతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై ఈ నెల 7వ తేదీన 'మేమున్నాం మీకోసం' శీర్షిక 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఏఈ చలపతి, లైన్‌మెన్ వెంకటేశ్వర్లుతో పాత విద్యుత్ నియంత్రికను తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు.

నాగలాపురం విద్యార్థులు..
ఆటల్లో ప్రావీణ్యులు

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు రకాల ఆటల్లో ప్రావీణ్యం సాధిస్తున్నారు. గ్రామీణ వాతావరణంలో ఉన్నా సుశిక్షణ అందిస్తున్న పీడీ సురేంద్రల సారథ్యంలో విద్యార్థినులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, కరాటే, యోగా వంటి రంగాల్లో పాఠశాల ఆవరణలో నిత్యం శిక్షణ పొందుతున్నారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ చదువు, క్రమశిక్షణ, ఆటలను సమపాళ్లలో సాధన చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

మనో పరుగుకు పతకాల పంట



నాగలాపురం పడమటి ఎస్సీకాలనీకి చెందిన ప్రసన్నకుమార్, అన్నపూర్ణల కుమారుడ మనోవెల్లీ పదవ తరగతి చదువుతున్నాడు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన 800, 1500 మీటర్ల పరుగు పందేలలో ప్రథమ స్థానంలో నిలిచాడు. జిల్లా స్థాయిలోనూ రాణించి పతకాలను అందుకున్నాడు. చదువుతో పాటు పరుగు పందెంలోనూ రాణించి ఉత్తమ పరుగుల వీరుడిగా నిలవడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాడు.

జిల్లా స్థాయికి కిషోర్



కృష్ణాపురం గ్రామానికి చెందిన రమేష్‌బాబు, లావణ్యల కుమారుడు కిషోర్. ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఖోఖో, కబడ్డీ పోటీల్లో విశేషంగా రాణిస్తూ నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజయంలో కీలక భూమిక పోషించాడు. జిల్లా స్థాయికి ఎంపికై భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీలకు సారథ్యం వహించడమే ధ్యేయంగా ఎంచుకున్నాడు.

చదువు, కబడ్డీలో సాయి ప్రతిభ



నాగలాపురం తూర్పు ఎస్సీకాలనీకి చెందిన గవాస్కర్ కుమార్తె సాయి. ఎనిమిదో తరగతి చదువుతోంది. బాలురుకు దీటుగా బాలికలు ఆటల్లోనూ సత్తా చాటుతామని చెప్పడంతో పాటు చేతల్లో చూపిస్తూ ప్రశంసలందుకుంటోంది. గతంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ, జిల్లా స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో రాణించి పతకాలు సాధించింది. జాతీయ స్థాయిలో రాణించి వైద్యురాలిగా స్థిరపడాలన్నదే లక్ష్యంగా ముందుకెళుతోంది.

రిషి కూతకు పాయింట్ల మోత



ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కృష్ణాపురానికి చెందిన చంద్రశేఖర్, మీనాల కుమారుడు రిషి కబడ్డీలో పాయింట్ల మోత మోగిస్తున్నాడు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో తన జట్టుకు పాయింట్లను తీసుకురావడంలో ముందువరుసలో నిలిచిన అతను ప్రస్తుతం జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. భవిష్యత్తులో పోలీసు అధికారి కావాలన్నదే తన ఆకాంక్షగా నిర్దేశించుకున్నాడు.

ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు, ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ఏసీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కస్తూరికి గతంలో ఉన్న విధులు అలాగే కొనసాగించారు. ఏఈవోలు హేమమాలినికి ఆలయ రెండో షిఫ్టు బాధ్యతలు అప్పగించారు. సతీష్‌మల్లికి ప్రొటోకాల్, ల్యాండ్స్, లీగల్ విభాగాలు, విద్యాసాగర్‌కు అన్నదానం, గోశాల విభాగాలు కేటాయించడంతో పాటు పలు విభాగాల్లోని అధికారులను అంతర్గతంగా బదిలీలు చేస్తూ ఆలయ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీపాదకూలీలకు పంచల వితరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీపాద కూలీలకు నాయుడుపేటకు చెందిన రాఘవేంద్ర గ్రూప్ కంపెనీ, చెన్నై అండ్ వేస్తా కనమర్లపూడి సుబ్రమణి, సురేష్ కుటుంబీకులు పంచలు, కండువాలు వితరణగా అందజేశారు. 50 మందికి అవసరమైన వస్త్రాలను బుధవారం ఆలయ ఏఈవో లోకేష్‌రెడ్డికి అందించారు. విరాళదాతలకు ఆలయం తరఫున స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అధికారుల నిర్లక్ష్యం.. పిల్లలకు శాపం

సత్యవేడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బీసీ కాలనీ, ఎన్టీఆర్ నగర్, విడోస్ కాలనీ, ఎస్టీకాలనీ, ఆర్టీసీ డిపో రోడ్డు, రాజీవ్ నగర్‌ల్లో సుమారు 750 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇక్కడ ఒకే ఒక అంగన్‌వాడీ కేంద్రం విడోస్ కాలనీలో నిర్వహిస్తున్నారు. బీసీ కాలనీ సమీపంలోని ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రం శిథిలం కావడంతో వీడోస్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోకి మార్చారు. ఈ కాలనీల్లో 0-5 సంవత్సరాల వయస్సు గల పిల్లలు సుమారు 150 మంది ఉన్నారు. 03-05 సంవత్సరాలు వయస్సున్న అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు 70 మంది ఉన్నారు. విడోస్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి సుమారు 15 నుంచి 20 మంది పిల్లలు హాజరు కాగా మిగిలిన పిల్లలు రాలేక పోతున్నారు. ఉన్న ఒక్క అంగన్‌వాడీ కేంద్రానికి ఆర్టీసీ డిపో రోడ్డు, ఎన్టీఆర్ నగర్, బీసీ కాలనీల నుంచి పిల్లలు రావాలంటే సుమారు కిలో మీటరు నుంచి రెండు కిలో మీటర్లు మేర దూరం ఉండడంతో పిల్లల తల్లిదండ్రులు పంపించేందుకు సుముఖత చూపడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



విడోస్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం

కొండను తొలగించి దారివేశారు

ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారిలో రైల్వే పైవంతెన నిర్మాణంతో ఎర్రకొండ కనుమరుగైంది. ఏర్పేడు వ్యాసాశ్రమానికి సమీపంలో ఎత్తైన ఎర్రకొండను చదును చేసి వంతెన నిర్మాణం చేపట్టడంతో పురాతనకాలంనాటి ఆనవాళ్లు తొలగిపోయాయి. కొండకు ఇరువైపులా ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ రాజకీయ నేతల స్వలాభంతో గతంలో కొండపై నుంచి రహదారిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడంతో పై వంతెన నిర్మాణం సైతం 'ఎస్' ఆకారంలో ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే ఎత్తైన గుట్ట కర్పూరంలా కరిగిపోయింది. ఓ వైపు ఏర్పేడు-వెంకటగిరి, రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారుల పైవంతెనలు ఏర్పేడుకు ఇరువైపులా హారంలా ఉన్నప్పటికీ చారిత్రాత్మక ఎర్రగుట్ట కనుమరుగు కావడంతో స్థానికుల్లో తెలియని వేదన నింపుతోంది. - న్యూస్‌టుడే, ఏర్పేడు



ఎర్రకొండను చదును చేసి ఏర్పాటు చేసిన రోడ్డు

ఆటో ప్రమాదంలో పలువురికి గాయాలు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: శ్రీసిటీ పరిధిలోని చెంగంబాక్కం గ్రామ సమీపంలోని పరిశ్రమలో హౌస్ కీపింగ్ పనులు ముగించుకుని ఆటోలో ఇంటికి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. సత్యవేడు మండలం చెంగంబాకంకు చెందిన కాటమ్మ ఆటో దిగుతుండగా ఆగి ఉన్న ఆటోను టెంపో ట్రావెలర్ వెనుక నుంచి ఢీ కొంది. ఈ ప్రమాదంలో సుజాత, అభిరమికి తీవ్ర గాయాలయ్యాయి. మరో మహిళ కాటమ్మ, ఆటో డ్రైవర్ చిరంజీవిలకు గాయాలయ్యాయి.

వివాహిత అదృశ్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని జయరామారావు వీధిలో నివాసముంటున్న వివాహిత అదృశ్యం కావడంపై వారి కుటుంబీకులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల కుమారుడితో పాటు ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆచూకీ లేక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్తాలేని సిబ్బంది.. సరకులు అందక ఇబ్బంది

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలో మూడు పంచాయతీలలో ఎండీయూ సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో ప్రజలకు చౌకదుకాణాల ద్వారా ప్రభుత్వం అందించే సరకులు అందక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పాండూరు, యానాదివెట్టు, రాచర్ల పంచాయతీలకు ఒక ఎండీయూ వాహనం ద్వారా సరకులు అందించాల్సి ఉంది. అయితే ఎన్నికల ఫలితాల అనంతరం ఎండీయూ సిబ్బంది పత్తా లేక పోవడంతో ఈ మూడు పంచాయతీల ప్రజలకు రేషన్ సరకులు సక్రమంగా అందడం లేదు. పలు పంచాయతీలలో ఎండీయూ వాహనాల ద్వారా సరకులను పంపిణీ చేస్తున్నప్పటికీ, ఈ మూడు పంచాయతీలకు మాత్రం ఎందుకు పంపిణీ చేయడం లేదో ప్రజలకు అంతుబట్టడం లేదు. దీంతో కొందరు మరో గత్యంతరం లేక రేషన్ దుకాణాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. వాహనం వస్తుందనే ఆశతో మరికొందరు ఎదురుచూసి, చివరకు నెల గడచిపోవడంతో బియ్యం, ఇతర సరకులను తెచ్చుకోలేకపోతున్నారు. రేషన్ సరకులు పంపిణీ చేసే సిబ్బంది వైకాపా సానుభూతి పరులు కావడంతో అధికారంలోకి తమ పార్టీ రాలేదన్న ఆవేదనతో ప్రజలకు సైతం రేషన్ సరకులను పంపిణీ చేయడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దారు వెంకటసుబ్బయ్యను వివరణ కోరగా ఎండీయూ సిబ్బందిని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

సత్యవేడు, న్యూస్‌టుడే: వ్యవసాయ యంత్ర పరికరాలు కావలిసిన రైతులు ముందుగా రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి మురళి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని దళవాయి అగ్రహారం, సత్యవేడులో వ్యవసాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మైక్రో ఇరిగేషన్ పరికరాలు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు రైతులకు రాయితీ ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు.



నారు మడులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ సుబ్రహ్మణ్యం, మురళి, రైతులు

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	110
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	187

పింఛను మంజూరు చేయాలని వినతి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: స్థానిక పురపాలక సంఘం పరిధి లోని వట్రపాళెంలో వలస వచ్చి కొత్తగా నివాసాలు ఏర్పాటు చేసు కున్న వారందరికీ సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ నేతలు మెరుగుమాల పార్థసారథి, ఆటపాక ఆనంద్ బుధవారం ఛైర్మన్ శ్రీమంత్‌రెడ్డి, కమిషనర్ చిన్నయ్యకు వినతిపత్రాలు అంద జేశారు. వట్రపాళెంలో మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. పరిశీలిస్తామని వారు హామీ ఇచ్చారు.

శ్రీపాద కూలీలకు పంచల వితరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీపాద కూలీలకు నాయు డుపేటకు చెందిన రాఘవేంద్ర గ్రూప్ కంపెనీ, చెన్నై అండ్ వేన్సా కనమర్లపూడి సుబ్రమణి, సురేష్ కుటుంబీ కులు పంచలు, కండువాలు వితరణ బుధవారం అందజేశారు. 50 మందికి అవసరమైన వస్త్రాలను బుధవారం ఆలయ ఈవో లోకేశ్వరరెడ్డికి అందించారు. విరాళదాతలకు ఆలయం తర పున స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ర.భ.స్థలంలో అక్రమ నిర్మాణాలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కొండా గుంట గ్రామంలో ర.భ.స్థలాన్ని కొందరు ఆక్ర మించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపించారు. ర.భ.శాఖ ఏఈ మల్లి కార్జునకు వివరణ కోరగా.. సర్వే పూర్తయ్యాక ఆక్రమ నిర్మాణాలు ఉంటే నోటీసులు ఇచ్చి, చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పంచాయతీ పాలనపై శిక్షణ

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లోని ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యులు చొప్పున హాజరైన వారికి గ్రామ పంచా యతీ పరిపాలన, విధులు, బాధ్యతలపై రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారం మొదలయ్యాయి. ఎంపీడీవో మనోహర్‌గౌడ్ ప్రారంభించగా.. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర శిక్షణ ఇచ్చారు. పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పరిపాలన విధానా లపై వారికి అవగాహన కల్పించినట్లు ఉమామహేశ్వరరావు చెప్పారు.

● **కోట, న్యూస్‌టుడే:** పంచాయతీల అభివృద్ధిలో ఉపసర్పంచులు, పాల కవర్గ సభ్యుల పాత్ర కీలకమని రిసోర్స్‌పర్సన్లు కిరణ్‌కుమార్, లోహిత్ పేర్కొ న్నారు. కోటలోని ఎంఆర్సీ భవనంలో రెండు రోజుల శిక్షణ తరగతులను ఎంపీపీ అంజమ్మ ప్రారంభించారు.

ఎంపీడీవోల నియామకం

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు, కోట, చిట్టమూరు మండలాలకు ఎంపీడీ వోలను నియమించారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వాకాడు ఎంపీడీవోగా పెళ్లకూరు మండల కార్యాలయం ఏవో పి.ఎం.అన్నపూర్ణరావు, కోట ఎంపీడీ వోగా అక్కడి ఈవోపీఆర్డీ వేణు, చిట్టమూరు ఎంపీడీవోగా అక్కడి ఈవోపీఆర్డీ మనోహర్‌గౌడ్‌ను నియమించారు. వీరంతా గురువారం విధుల్లో చేరనున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు మండలాలకు రెగ్యులర్ ఎంపీడీవోలను నియమించక.. ఎఫ్ఏసీ పద్ధతిలో అదనపు బాధ్యతలు ఇస్తూ వీరిని నియమించడం విశేషం. నియోజకవర్గంలోని గూడూరు గ్రామీణం, చిల్ల కూరు మండలాలకు మాత్రం రెగ్యులర్ ఎంపీడీవోల నియామకం జరిగింది.



రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన మాజీ ఎంపీపీ, ఉప సర్పంచి, వార్డు సభ్యులు

వైకాపాకు మాజీ ఎంపీపీ, వార్డు సభ్యుల రాజీనామా

వాకాడు, న్యూస్‌టుడే: మాజీ ఎంపీపీ, నెల్లిపూడి పంచాయతీ వైకాపా నేత పల్లాపల్లి వెంకటేశ్వర్లు, పంచాయతీ ఉప సర్పంచి అట్ల శ్రీహరి, మరో ఐదు గురు వార్డు సభ్యులు వైకాపాకు రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటిం చారు. వీరంతా స్థానిక బ్యారేజీ అతిథిగృహం ఆవరణలో సమావేశమై విలే కర్లకు తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తమ పంచాయతీ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, తమ వ్యక్తిగత కారణాలతో పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు చెప్పారు. త్వరలో తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. రాజీనామా చేసిన వారిలో 1, 3, 4, 6, 8, 9 పంచాయతీ వార్డుల సభ్యులు గుంటక రమణయ్య, బల్లవోలు శంకరమ్మ, ఎంబేటి లింగయ్య, పల్లాపల్లి సురేష్, వేనాటి మునెమ్మ, వైకాపా గ్రామ సచివాలయ కన్వీనర్ నజీర్‌బాషా, నేతలు గండవరం చంద్రారెడ్డి, అట్ల కస్తూరయ్య, కావలి వెంకటయ్య, వైకాపా కార్యకర్తలు ఉన్నారు.

స్వర్ణముఖి తీరంలో ఆక్రమణల పరిశీలన

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండలంలో తిమ్మాజీకండ్రిగ సమీ పంలో స్వర్ణముఖి తీరంలో ఉన్న అక్రమ ఇటుక బట్టీలను తహసీల్దారు గీతావాణి పరిశీలించారు. ఈ ప్రాంతంలో నదీ తీరాన ఉన్న పోరంబోకు భూములను కొందరు ఆక్రమించి ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని, బొగ్గు, ఇతర వ్యర్థాలను నింపి నదీ తీరాన్ని కాలుష్యానికి గురి చేస్తున్నా రని కొందరు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్దారు ఆక్రమణలు పరిశీలించి.. భూమార్పిడి పన్ను చెల్లించకుండా బట్టీలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మేమింతే.. తవ్వకాలు ఆపమంతే

● సవాల్ విసురుతున్న ఇసుక మాఫియా

● కాళంగి, స్వర్ణముఖి నుంచి రేయింబవళ్లు తరలింపు



నూకలపాళెం సమీపాన కాళంగి నుంచి ఇసుక తెస్తున్న ట్రాక్టర్

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఎన్ని నిబంధనలు పెట్టినా.. ఎంత మంది సిబ్బంది ఉన్నా.. మా వెనుక నేతలు ఉన్నారు.. మేమింతే.. ఇసుక తవ్వ కాలు ఆగే ప్రసక్తేలేదంటూ మాఫియా సవాల్ విసురుతోంది. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాల్సిన యంత్రాంగం నామమాత్రపు దాడులతో సరిపెడుతుండటంతో మాఫియా చెలరే గిపోతోంది.


సూళ్లూరుపేట మండలంలోని నూక లపాళెం సమీపాన కాళంగినదిలో ఇసుక తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇసుక తవ్వకాలతో గ్రామాలకు తాగునీరు అందించే పైపులైన్లు బయటపడుతు న్నాయి. మరికొన్నిచోట్ల పగిలిపో యాయి. ఇక్కడ ఇంత జరుగుతున్నా.. అధికార యంత్రాంగం అదిగో.. ఇదిగో అంటూ తప్పించుకుంటోంది. పెళ్లకూరు మండలంలోని కల్యకూరు, ముమ్మారెడ్డి గుంట, పుల్లూరు ప్రాంతాల్లోని స్వర్ణ ముఖి నది నుంచి రేయింబవళ్లు తవ్వ కాలు జరుపుతూ, ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారు. కాళంగి, స్వర్ణముఖి నదుల్లో ఇసుక తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.

యంత్రాంగం ఏం చేస్తున్నట్లు?

ఇసుక తవ్వకాలను అడ్డుకోవా ల్సిన మైనింగ్, రెవెన్యూ, జలవన రులు, పోలీస్ శాఖ చోద్యం చూస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక విషయంలో అధికారపార్టీ నేతలెవరూ జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పదే పదే చెబు తున్నా.. సూళ్లూరుపేట నియోజ కవర్గంలో మాత్రం అమలు కావడం లేదు. ఇసుక ట్రాక్టర్లను ఎక్కడైనా అడపాదడపా రెవెన్యూ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే.. వెంటనే వారిపై ఒత్తిడి తెచ్చి, వాటిని వదిలిపె ట్టేలా చేస్తున్నారు.

నిఘా కమిటీలు ఏమైనట్లు?

ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు సూళ్లూరుపేట డివిజన్‌లో నిఘా కమిటీలు ఏర్పాటు చేసినట్లు అధి కారులు ఆర్భాటపు ప్రకటనలు గుప్పిం చారు. అయితే క్షేత్రస్థాయిలో ఇవి కనిపిం చడం లేదు. సూళ్లూరుపేట, పెళ్లకూరు, తడ మండలాల్లో జరుగుతున్న ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియాను వీరు అడ్డుకో లేకపోతున్నారు. డివిజన్ కేంద్రానికి కూతవేటు దూరంలో కాళంగి నదిలో రేయింబవళ్లు ఇసుక తవ్వకాలు జరు పుతూ ఆర్డీవో కార్యాలయం మీదుగానే ట్రాక్టర్లు వెళ్తున్నా.. అధికారులు మీనమే షాలు లెక్కిస్తున్నారు.



తవ్వకాలతో బయటపడిన తాగునీటి పైపులైన్లు



దెబ్బతిన్న తాగునీటి పైపులైన్

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు?

జిల్లాలో ఎక్కడా కూడా ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వ కాలు జరపకూడదని, అలా జరి గితే సంబంధిత వీఆర్వోలపై, సిబ్బందిపై చర్యలు తీసుకోవా లని, వారిపై ప్రత్యేక నివేదిక పంపించాలని గత నెల 16న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకా ళహస్తి, తిరుపతి రెవెన్యూ డివి జనల్ అధికారులను ఆదేశిం చారు. క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నంగా ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: స్థానిక అగ్రహారపేటలోని ప్రధాన వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. చీకట్లో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- సుబ్రహ్మణ్యం, స్థానికుడు**

సమాధానం: వీధి దీపాలు వేసేలా చర్యలు తీసు కుంటాం. **- ఫజులుల్లా, కమిషనర్**

సమస్య: నాయుడుపేట మండలం పుదూరు పంచాయతీ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు బాగు చేయాలి. వర్షం కురిస్తే ప్రజలు బాగా ఇబ్బంది పడుతున్నారు. **- రంగయ్య, స్థానికుడు**

సమాధానం: దెబ్బతిన్న వీధుల బాగుకు నిధులు కేటా యింపు చేసి పనులు చేస్తాం.

- వెంకట్రావు, కార్యదర్శి, పుదూరు

నాయుడుపేట, న్యూస్‌టుడే:

సమస్య: నాయుడుపేట పట్టణంలో గురుకుల పాఠశా లకు ఎదురుగా ఉన్న నాలుగో వీధిలో కల్వర్టు లేనందున మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది.

- ఎస్.కె.అల్లాభక్షు, ఎల్.ఎ.సాగరం

సమాధానం: ఎల్.ఎ.సాగరం ప్రాంతాన్ని పరిశీలించి మురుగు రోడ్డుపై ప్రవహించకుండా చూస్తాం.

-ఎస్.కె.ఫజులుల్లా, కమిషనర్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని సాధుపేట ప్రధాన రహదారి ప్రాంతంలో రోడ్డుపై చెత్తాచెదారాలు ఉండడంతో పరిసరాలు దుర్వాసన భరితంగా ఉన్నాయి. **- గోవర్దన్, గూడూరు**

సమాధానం: చెత్తా చెదారాలను సిబ్బందితో వెంటనే తొలగిస్తాం. **-వెంకటేశ్వర్లు, కమిషనర్**

వెలిగిన వీధి దీపాలు

స్పందనకు వందనం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: స్థానిక పురపాలక సంఘంలో వివిధ సమస్యలను ప్రజలు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకుతో డుగా' దృష్టికి తీసుకొచ్చారు. వీటిని పురపాలక కమిషనర్ చిన్నయ్య దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే పరిష్క రించారు. పురపాలికలోని కోళ్లమిట్ట ప్రాంతంలో రేడియో రూం వీధి చివర్లో, సాయినగర్‌లో, సూళ్లూరుపేట నుంచి మన్నారుపోలూరుకు వెళ్లే శ్రీకాళహస్తి రోడ్డులో వీధి దీపాలు వెలిగేలా కమిషనర్ చర్యలు చేపట్టారు.

కాలువలో పూడికతీత

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 7న 'ఈనాడు' లో ప్రచురితమైన వార్తకు పురపాలక కమిషనర్ వెంకటే శ్వర్లు స్పందించారు. పట్టణంలోని రాణిపేట ప్రాంతంలో సిబ్బందితో కాలువల్లో పూడిక తొలగింపజేశారు.

వీణాపాణి.. విజయ స్వరూపిణి

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవ ర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి వేడు కల్లో భాగంగా బుధవారం అమ్మవార్లు వివిధ రూపా ల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

- న్యూస్‌టుడే బృందం



చిల్లకూరు: సరస్వతీదేవిగా ముత్యాలమ్మ



వాకాడు: మహాశక్తిగా నాగవరప్పమ్మ



కోట: ధూమావతిగా కోటమ్మ



గూడూరు పట్టణం: సరస్వతి దేవిగా మహాలక్ష్మి



నాయుడుపేట: సరస్వతి దేవిగా దుర్గామల్లేశ్వరి



వెంకటగిరి: సరస్వతిగా మందనాంచారేశ్వరి దేవి

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

గూడూరు పట్టణం : భాజపా సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని, రాష్ట్రంలో తిరుపతి జిల్లా 3వ స్థానంలో ఉందని, మొదటి స్థానానికి చేర్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతి నిధి భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని భాజపా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణంనాయుడు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహిం చారు. నాయకులు కోటేశ్వరరావు, బిందుమ హేశ్వర్‌రెడ్డి, దయాకర్, నరేంద్ర, జీవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెగువేరాను ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: విప్లవకా రుడు చెగువేరాను యువత ఆదర్శంగా తీసుకో వాలని సీపీఐ నాయకుడు ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చెగువేరా జయంతి పురస్కరించుకుని బుధవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు రమేష్, జమాలుల్లా, నర్సింహరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నేత కుటుంబానికి నెలవల పరామర్శ

పెళ్లకూరు, న్యూస్‌టుడే: తెదేపా మండల మాజీ అధ్యక్షుడు అక్కరపల్లి గోపాల్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఇటీవల గోపాల్‌రెడ్డి తమ్ముడు తేజోపాల్‌రెడ్డి మరణించగా బుధవారం పాలచ్చూ రులో ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. తెదేపా మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, దామెర్ల ప్రసాద్‌నాయుడు, మురళీనాయుడు, శేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం





సూళ్లూరుపేట మండలంలోని సర్వారెడ్డికండ్రిగ గ్రామంలో కుంభయ్యగారి చెరువుకు వెళ్లే దారిలో ఓ స్తంభానికి ఏర్పాటు చేసిన నియంత్రిక నేలవాలేలా ఉంది. ఇక్కడ స్తంభం బాగా పక్కకు వాలిపోయింది. ఈదురుగాలులు వీస్తే పడేలా ఉంది. దాంతోపాటు చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. అలాగే దీనికి కూతవేటు దూరంలో మరో వీధి సింగిల్ ఫేజ్ నియంత్రికను పిచ్చిమొక్కలు కమ్మేశాయి. గ్రామంలో ఇలా ఉంటే.. డిస్కం సిబ్బంది ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరిగితేనే విద్యుత్తు శాఖ ఉద్యోగులు స్పందించేలా ఉన్నారు.

- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

పట్టణ రోడ్లు.. ఇలాగేనా ఉండేది?



నాయుడుపేట : పట్టణ వాతావరణం అంటే గుంతలు లేకుండా విశాలమైన రోడ్లు.. ఆహ్లాద కరమైన వాతావరణం ఉంటుందని పౌరులు భావిస్తారు. పలు ప్రాంతాలకు ప్రధాన కూడలిగా ఉన్న నాయుడుపేట పట్టణం ఇందుకు భిన్నంగా మారింది. ఏ ప్రాంతానికి వెళ్లినా గుంతలతో కూడిన రోడ్లు, వాహనాలు సాఫీగా తిరగలేని విధంగా ఆక్రమణలు, రోడ్లపై మురుగు ప్రవాహం వంటి సమస్యలతో దర్శనం ఇస్తోంది. ఏడాది నుంచి ఈ మార్గంలో ప్రయాణం నరకంగా మారింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు నిత్యం ఈ మార్గంలో ప్రజల అవస్థలు కళ్లారా చూస్తున్నా పట్టించుకో వడం లేదు. మరమ్మతులు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు అంచున తవ్వకాలతో ప్రమాదం

నాయుడుపేట : గ్యాస్ పైపులు అమర్చడానికి నాయుడుపేట-వెంకటగిరి మార్గంలో రాష్ట్ర రహ దారి అంచున తవ్వకాలు జరపడం ప్రమాదక రంగా మారింది. రోడ్డుకు కొంత దూరంలో గాడి తీయాల్సి ఉన్నా రోడ్డు అనుకుని తవ్వకాలు జరు పుతున్నారు. పొరపాటున వాహనాలు పక్కకు జరిగితే గుంతలోకి వెళ్త న్నాయి. నాయుడుపేట పట్టణంలో ఇదే తరహాలో పైపులైన్ల కోసం తీసిన గాడులు సరిగా పూడ్చకపోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది.





సందడి చేస్తున్న అప్పారావు, వినోద్ తదితరులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు మంగళ వారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జబర్దస్త్ బృందం సందడి చేసింది. కచేరి, సినీ డూప్‌లతో నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. జబర్దస్త్ టీమ్ శాంతిస్వరూప్, అప్పారావు, ఇమ్మానియేల్, వినోద్ తమ హాస్యంతో నవ్వులు పూయించారు. నాయకులు తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివా సులు, గుండాల లీలావతి, మట్టం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

ప్రజాప్రయోజన స్థలాక్రమణపై ఫిర్యాదు.. వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్జీవో కాలనీ సర్వే నంబరు 150/11,151/1,152లో ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన ఖాళీ స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకుంటున్నారంటూ తహసీల్దా రుకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న ఈ స్థలం పార్కు, గ్రంథాలయం నిర్మించాలని అప్పటి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి కూడా విన్నవించినట్లు చెప్పారు. ఆక్రమణలను తొలగించి ప్రజాప్రయోజనాల కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవా లని కోరారు.

క్షేత్ర సహాయకులపై విచారణ.. కోట, న్యూస్‌టుడే: కోట మండలం సిద్ధవరం, వంజివాకలో బుధవారం క్షేత్ర సహాయకులపై ఏపీడీ వరప్రసాద్ విచారణ జరిపారు. కూలీలను అడిగి వివరాలు సేకరించారు. వెంట ఏపీవో పూర్ణిమ తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన.. నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘం విన్నమాల గ్రామంలో బుధవారం నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు హెచ్‌ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ మేనేజరు బాలాజీ ఎయిడ్స్ వ్యాప్తికి గల కారణాలను వివ రించారు.

సాగుపై అవగాహన.. కోట, న్యూస్‌టుడే: కోట మండలం చెందోడు, చంద్రశేఖరపురం గ్రామాల్లో బుధవారం వ్యవసా యశాఖ ఆధ్వర్యాన 'పొలం పిలుస్తోంది' అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ రైతులందరూ అవగాహనతో కూడిన సాగు చేయాలన్నారు.

టిడ్కో ఛైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు.. నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నెల్లూరులో పర్యటనకు వచ్చిన ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌ను బుధవారం సూళ్లూ రుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఉయ్యాల ప్రవీణ్, ప్రధాన నాయకులు కలిసి సన్మానించారు. పార్టీ గురించి చర్చించారు. నాయకులు కృష్ణారావు, శోభన్, సతీష్, బాలు శెట్టి, విజయ్, గోపి, శ్రీను ఉన్నారు.

ఆసియా అథ్లెటిక్ పోటీలకు వెంకట్రావు .. నాయుడు పేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట మండలం పుదూరు పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు ఈ నెల 12 నుంచి 13 వరకు మలేసియాలోని కౌలాలంపూర్‌లో మొద లయ్యే ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బుధవారం మండలంలోని పంచాయతీల కార్యదర్శులు అశోక్, సుమన్, పరమశివయ్య తదితరులు ఆయన్ని అభినందించారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం.. నాయుడు పేట, న్యూస్‌టుడే: జీలుగకు ప్రత్యామ్నాయంగా నవధాన్యా లను జీలుగతో కలిపి సీజనుకు ముందు పొలంలో సాగు చేసి కొంతకాలం తరువాత భూమిని దున్ని చదును చేస్తే నేల సారవంతం అవుతుందని ఏవో గణేష్ అన్నారు. మండల ఉద్యానవనశాఖ అధికారి శారద, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు.. బాలాయపల్లి, న్యూస్‌టుడే: సహకార బ్యాంకులో పనిచేస్తున్న యాచవరానికి చెందిన సత్యనారాయ ణతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు. ఇతరుల పొలాల సర్వే నంబర్ల వివరాలు కలిగిన ధ్రువీకరణలతో గతంలో వారు సహకార శాఖ బ్యాంకులో రుణాలు తీసుకున్నారనే ఫిర్యాదుపై ఈ చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్టమూరు(కోట) : చిట్టమూరు మండలం వెలిగాజులప ల్లికి చెందిన మురుగన్(34) కుటుంబ కలహాల కారణంగా ఈ నెల 3న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. నెల్లూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ కోటయ్య తెలిపారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

చిల్లకూరు, న్యూస్‌టుడే: వరగలి అడ్డరోడ్డు కూడలి సమీ పాన జాతీయ రహదారిపై బుధవారం లారీ బోల్తా కొట్టింది. చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే మార్గంలో ఘటన జరిగింది. రహదారికి అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనంలో ఉన్నవారు సురక్షితంగా బయట పడటంతో ప్రమాదం తప్పింది.

పుల్లూరులో వ్యక్తిపై దాడి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పుల్లూరులో బుధవారం మారాబ త్తిన రవిబాబుపై ఇదే గ్రామానికి చెందిన నారాయణ కర్రతో దాడి చేసి గాయపరిచాడు. ఇదే గ్రామానికి చెందిన నారా యణ మద్యం మత్తులో రవిబాబుతో గొడవపడి ఇంట్లో చొర బడి కర్రతో కొట్టినట్లు స్థానికులు తెలిపారు. బాధితుడు పోలీ సులకు ఫిర్యాదు చేశాడు.

చెరువులో చేపల చోరీ

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణ నడిబొడ్డున ఉన్న అమ్మ వారి పేట చెరువులో చేపలు చోరీ చేశారని స్థానికులు ఆరో పించారు. పట్టణంలో అతి పెద్దదైన ఈ చెరువులో కొంత కాలంగా చేపలు పట్టలేదు. మున్సిపాలిటీ తరఫున చేపల చెరువు వేలం గడువు ముగిసింది. కానీ నేటికీ చేపలు వేలం నిర్వహించకపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. గడువు ముగిసి నెలలు కావస్తున్నా మున్సిపాలిటీ అధికా రులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంతో చెరువులో చేపల వేట యథేచ్ఛగా సాగుతోంది. తాజాగా అధికార, ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు కుమ్మక్కై భారీస్థాయిలో చేపలు పట్టారు. సకాలంలో వేలం నిర్వహిస్తే పురపాలికకు ఆదాయం వచ్చేది.

రోడ్డు ప్రమాదంలో తమిళ విద్యార్థి..

తడ, న్యూస్‌టుడే: తడ మండలం భీమునివారిపాళెం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడు పరిధిలోని పుదువాయల్‌కు చెందిన విద్యార్థి ఇలన్‌గోవన్(18) మృతి చెందాడు. పొన్నేరిలో బీఏ చదు వుతున్న ఇలన్‌గోవన్ కళాశాలకు వెళ్తున్నానని చెప్పి చెల్లెలి స్కూటీ తీసుకుని స్నేహితుడితో తడ సమీపంలోని వరదాయపాళెం వాటర్‌పాల్స్‌కు వచ్చాడు. సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు స్నేహితుడు సంతోష్ వాహనం నడు పుతుండగా ఇలన్‌గోవన్ వెనుక కూర్చున్నాడు. భీముని వారిపాళెం వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొని అదుపు తప్పి రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడటంతో చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో క్యాన్సర్ పరీక్షలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: తిరుపతిలోని స్విమ్స్ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యాన బుధ వారం పేర్నాడు పీహెచ్‌సీ పరిధిలోని మన్నేముత్తేరిలో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేప ట్టారు. వైద్యాధికారులు జి.హరిత, ఎస్.రమణయ్య, సర్పంచి చిన్నిరాజా తదితరులు పాల్గొన్నారు.

చావలిలో ఇసుక తవ్వకాల రగడ



చావలిలో ట్రాక్టర్‌ను అడ్డుకున్న స్థానికులు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం చావలిలో స్వర్ణముఖి నుంచి ఇసుక అక్రమ తవ్వకాలపై బుధవారం రాత్రి ఇసుక రగడ ఏర్పడింది. ఇక్కడ స్థానికులు ఎడ్లబండ్లతో ఇసుక తరలించేవారు. వారం రోజులుగా రాత్రి వేళల్లో ముగ్గురు ఇసుక ట్రాక్టర్లతో తరలించడంపై అభ్యంతరం వ్యక్త మైంది. దీంతో ఎడ్లబండ్ల యజమానులు ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇలా ఇరువురి మధ్య పెద్ద గొడవ జరిగింది. ఎడ్లబండ్ల యజమానులు, ట్రాక్టర్ల యజ మానులిద్దరూ గొడవలకు దిగడంతో శాంతిభ ద్రతల సమస్యగా మారింది. ఇలా ఇక్కడ రెండు వర్గాలుగా ఏర్పడి వివాదం నెలకొంది. ట్రాక్టర్ ఆపేసిన స్థానికులు పోలీస్, రెవె న్యూకు సమాచారమిచ్చినట్లు తెలిపారు.

నేడు ఆధార్ సేవలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: తపాలా వారోత్స వాల సందర్భంగా సూళ్లూ రుపేట పోస్టాఫీసులో గురువారం ఆధార్ సేవలు నిర్వహిస్తామని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ టి.షణ్ముఖ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొత్త ఆధార్‌కార్డులు, పేర్లు మార్పు, ఇతరత్రా సరిచేస్తామన్నారు.

ఆర్యవైశ్య సంఘ నేతలకు సత్కారం

గూడూరు పట్టణం : కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆల యంలో జరిగిన వారాహి మాత ఉత్సవాల్లో నూతనంగా ఎంపి కైన జిల్లా ఆర్యవైశ్య సంఘ సభ్యులను సత్కరించారు. ఆ సంఘం గ్రామీణ విభాగం అధ్యక్షుడు గూడూరు కిషోర్‌కుమార్, కార్యదర్శి గాదంశెట్టి వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు కె. సావిత్రి, నాయకులు మధు, కిరణ్‌లను గూడూరు పట్టణ ఆర్య వైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు చెంచురామయ్య, అధ్యక్షుడు కోట రామరావు సత్కరించి.. ప్రసాదాలు అందజేశారు.



ఆర్యవైశ్య నేతలను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు